అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# దైవ ప్రసన్నతే పరమావధి

మా చిన్నప్పుడు రంజాన్ అని ఉత్సాహంగా జరుపుకున్న పండుగ. **రమజాన్** లేదా **రమదాన్** అని పలకాలన్నది తర్వాత తెలిసిన విషయం. నేర్చుకోవడం అనేది జీవితాంతం కొనసాగుతూనే ఉంటుంది.

గడిచిన రోజు కన్నా ఈ రోజు మేలయినదిగా ఉండాలని ప్రవక్త ముహమ్మద్(స) అన్నారు. ఈ రోజు ఏం నేర్చుకున్నాం? ఈ రోజు ఏం చేశాం? అన్న పునరాలోచన ప్రతి రోజు నిద్రపోయే ముందు చేసుకోవలసిందే. లేకపోతే జీవితం ఒక గానుగెద్దు అవుతుంది.

ప్రతి రోజు సమీక్షలు చేసుకునేవాళ్ళు చాలా మంది ఉంటారు. ఈ రోజు ఎంత సంపాదించాం? ఈ రోజు ఏ ఏ మీటింగులు పెట్టాం? ఈ రోజు ఎంత ఆనందించాం? ఈ రోజు ఎంత ఎంజాయ్ చేశాం? ఇలాంటి సమీక్షలు కూడా జరుగుతూనే ఉంటాయి.

కాని...చేయవలసిన సమీక్ష అసలు మనిషి జీవితం ఏమిటి? ఎందుకు పుట్టాడు? ఎందుకు తాపత్రయపడుతున్నాడు? దేని కోసం తాపత్రయపడాలి? ఎలా జీవించాలి? అసలు మనిషి జీవిత లక్ష్యం ఏమిటి? మరణించిన తర్వాత మనిషి ఏమవుతాడు? ఇక్కడ చాలా తప్పులు చేసి చట్టం కళ్ళు గప్పినా ఆ తర్వాత ఏమీ ఉండదా? మరణానంతరం మనిషి ఏమవుతాడు? జీవితంలో చేసిన పనులు, చెప్పిన మాటలు మరణానంతరం కూడా వెంటాడుతాయా? మనిషి జీవితానికి లెక్క చెప్పుకోవలసి ఉంటుందా? ఇలాంటి ప్రశ్నలపై ఆలోచిస్తే ప్రతి రోజు చేసుకునే సమీక్ష వేరే విధంగా ఉంటుంది.

మనిషి జీవితం పరుగుల జీవితం అయిపోయింది. ఉన్నదొక్కటే జీవితం...అందులో బలం, శక్తి ఉండి ఏదైనా చేయగలిగిన సామర్థ్యం ఉన్న వయసు కూడా కొన్ని దశాబ్దులు మాత్రమే. ఈ టైములోనే చేయవలసిందంతా చేసుకోవాలి. పిల్లలకు సంపాదించి పెట్టాలి. బాగా బతకాలి. బాధలు లేకుండా బతకాలి. సంతోషంగా బతకాలి. ఎలా వీలయితే అలా తన బాగుకోసం ప్రయత్నించాలి. సమాజంలో ఒక ప్రిస్టేజ్‌తో బతకాలి. ఈ ధ్యాసలో బతుకు బండిని ఉరుకు లెత్తించడమే నేటి జీవితమయ్యింది.

నిజానికి మనిషి జీవించడానికి కావలసిందేమిటి? ఆకలి తీరడానికి రెండు ముద్దలు, ఒళ్ళు కప్పుకోడానికి దుస్తులు, తలదాచుకోడానికి పైకప్పు... ఇంతకు మించి కనీస అవసరాలు లేవు. కాని ఇప్పుడు అవసరాలు, ఆకాంక్షలు చాలా పెరిగిపోయాయి. కోరికల గుర్రాలకు కళ్ళెం వేసినప్పుడే మనిషి తానెవరు? ఎందుకు ప్రపంచంలోకి వచ్చాడు? ఎటు వెళుతున్నాడు? అనే ప్రశ్నలపై ఆలోచించగలడు.

రమజాన్ మాసం ఈ ప్రశ్నలపై ఆలోచించే అవకాశమిస్తుంది. రమజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటారు. దాదాపు పదిహేను, పదహారు గంటల కాలం ఏమీ తినకుండా, ఏమి తాగకుండా, కోరికలన్నింటినీ అణచుకుని ఉపవాసం చేసేవాళ్ళు ఎందుకు చేస్తున్నారు?

ఆ... ఇదంతా స్వర్గం కోసం చేస్తున్నార్లేవయ్యా? అని సగటు నిరీశ్వరవాద మిత్రులు చెప్పడం మామూలే.

కొందరి ఉపవాసాల వల్ల వారికి కేవలం పస్తులు తప్ప మరేమీ లభించవని కూడా ధర్మం చెబుతోంది. కాబట్టి ఉపవాసాల మూల ఉద్దేశ్యం కాస్త అర్థం చేసుకుంటే విషయం తేటతెల్లమవుతుంది.

ఉపవాసాల సారాంశాన్ని ఖుర్ఆన్ గ్రంథం ఒక్క పదం “తఖ్వా”లో కుదించింది.

**“విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది – ఏ విధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించే వారికి కూడ విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది.”** (అల్ బఖర: 183)

ఇక్కడ “తఖ్వా” అనే పదాన్ని తెలుగులో భయభక్తులు అని అనువదించడం జరిగింది. అసలు తఖ్వా ఏమిటి? ఉపవాసానికి దానికి సంబంధమేమిటి? దివ్యఖుర్ఆన్‌లో తఖ్వా అనే పదం అనేక పర్యాయాలు వచ్చింది. తఖ్వా అనే పదం మనిషి తనను సృష్టించిన దైవం పట్ల ఎలాంటి వైఖరి కలిగి ఉండాలో సూచించే పదం. ప్రేమ, భక్తి, భయం అన్నీ కలిసిన భావమిది.

ప్రేమ అనేది సౌందర్యం, సానుభూతి, మంచితనాలకు నెలవైన భావన. ప్రేమ ఉంది కాబట్టే ప్రపంచం ఉంది. తల్లి ప్రేమ లేకపోతే ప్రపంచం ఎలా ఉండేది? తండ్రి ప్రేమ లేకపోతే ప్రపంచం ఎలా ఉండేది? భార్యాభర్తల మధ్య ప్రేమ లేకపోతే ప్రపంచం ఎలా ఉండేది? ఒక్కసారి ఆలోచించండి. అలాగే మనిషికి సృష్టికర్త పట్ల ప్రేమ ఉంటే ఆ ప్రపంచం చాలా అందంగా మారిపోతుంది.

భక్తి భావన అనేది మనిషిని నిబద్ధుడిని చేసే భావన. సృష్టించిన వాడు మహాశక్తిమంతుడు, మహాజ్ఞాని, అన్నీ తెలిసిన వాడు అనే భావనతో సృష్టికర్త పట్ల పూర్తి నిబద్ధత కలిగి ఉంటే ప్రపంచం ఎలా మారిపోతుంది?

చివరగా భయం. తప్పు చేస్తే తల్లి దండిస్తుందన్న భయం పిల్లవాడిని క్రమశిక్షణలో ఉంచుతుంది. క్రమశిక్షణ జీవితంలో విజయాలను అందిస్తుంది. సృష్టికర్త పట్ల కూడా ఇలాంటి భయమే ఉంటే, సృష్టికర్త చెప్పినట్లు నడుచుకోకపోతే శిక్ష పడుతుందన్న భయం ఉంటే అప్పుడు మనిషి దైవప్రసన్నత కోసమే జీవిస్తాడు. ఇలా జీవించడమే అసలు సాఫల్యం.

దైవ ప్రసన్నతను చూరగొనడం మనిషి జీవిత లక్ష్యం కావాలన్నది ఆధ్యాత్మికతకు కేంద్ర బిందువు.

అసలు మనిషి ఎందుకు పుట్టాడు? జీవన్మరణాల తర్వాత ఏమవుతాడు? అనే ప్రశ్నలకు జవాబులిస్తుంది.

కాబట్టి, మనిషి తన నిన్నటి రోజు కన్నా ఈ రోజు బాగుండాలంటే ఈ ప్రశ్నల వెలుగులోనే తన ఆచరణలను సంస్కరించుకోవలసి ఉంటుంది. కేవలం కొన్ని ఆచరణలు యాంత్రికంగా చేయడం కాదు, ఆ ఆచరణల వెనుక స్ఫూర్తిని అర్థం చేసుకుని మరీ చేయాలి. సత్కార్యాలు అంటే మంచి పనులు చేయాలి. సత్కార్యం అంటే ఏమిటి?

దివ్యఖుర్ఆన్ దీనికి జవాబిచ్చింది.

**“సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను అంతిమ దినాన్నీ, దూతలనూ, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయపూర్వకంగా విశ్వసించటం. ఇంకా అల్లాహ్ పట్ల ప్రేమతో తాము ఎక్కువగా ఇష్టపడే ధనాన్ని బంధువుల కొరకూ, అనాధుల కొరకూ, నిరుపేదల కొరకూ, బాటసారుల కొరకూ, సహాయం చెయ్యండి అని అర్థించేవారి కొరకూ, ఖైదీలను విడుదల చెయ్యటానికి వ్యయపరచటం. ఇంకా నమాజును స్థాపించటం, జకాత్ ఇవ్వటం, వాగ్దానం చేస్తే దానిని పాలించేవారూ, కష్ట కాలంలో, లేమిలో, సత్యానికీ అసత్యానికీ మధ్య జరిగే పోరాటంలో స్థైర్యం చూపే వారూ సత్పురుషులు. వాస్తవంగా సత్యసంధులు, అల్లాహ్ ఎడల భయభక్తులు కలవారు వీరే.”** (అల్ బఖర: 177)

క్లుప్తంగా చెప్పాలంటే మనిషి తనను సృష్టించిన వాడు ఉన్నాడని విశ్వసించటం. ఆ సృష్టికర్త మనిషి మార్గదర్శనానికి హితోపదేశాలను పంపించాడని విశ్వసించడం. ఆ హితోపదేశాలను పాటించి జీవిస్తే దైవప్రసన్నత లభిస్తుందని నమ్మడం. ఆ హితోపదేశాల ప్రకారం పరులకు మేలు చేస్తూ

జీవించడం. ఇది నైతికత. ఈ నైతికతే అందమైన ప్రపంచాన్ని నిర్మించడానికి అవసరం. ఇలాంటి వ్యక్తిత్వాన్ని నిర్మించేదే ఉపవాసం.

**"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగానూ, తెగలుగానూ చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు."**

(హుజురాత్: 13)

నైతిక ప్రమాణాలు, నడవడి ఉత్తమంగా ఉన్న ప్రజలుంటే, ఆ సమాజం ఉత్తమ సమాజంగా మారుతుంది.

**"అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసిస్తున్న ప్రతివానికి ఈ విషయాలు బోధించబడుతున్నాయి. ఎవడు అల్లాహ్‌కు భయపడుతూ పని చేస్తాడో, అతనికి అల్లాహ్ కష్టాల నుండి గట్టెక్కే మార్గం చూపుతాడు"** (తలాక్: 2,3)

ఈ భూమి ఎవరి స్వంతమూ కాదు. ఎవడూ ఈ నేలను తన మరణానంతరం తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని తీసుకు వెళ్ళడు.

**"ఓర్పు వహించండి. భూమి దైవానిది. తన దాసులలో తాను కోరిన వారిని దానికి వారసులుగా చేస్తాడు. అంతిమ సాఫల్యం అల్లాహ్‌కు భయపడుతూ పనిచేసే వారి కొరకే."**(ఆరాఫ్: 128)

ఈ అవగాహన మనిషిలో జనిస్తే, జీవితం చాలా చిన్నదని అర్థమవుతుంది. ఈ చిన్న జీవితంలో చేయవలసిన అసలు పని దైవంపట్ల భయభక్తులతో జీవించటం. కనీస అవసరాల కోసం సంపాదించటం, సంపాదించిన దాన్ని ఇతరులతో పంచుకోవటం, దైవప్రసన్నత కోసం ఎల్లప్పుడు దైవం చూస్తున్నాడనే భావంతో జీవించటం. ఉపవాసం నేర్పేది ఇదే. అందువల్లనే ఉపవాసం పాటిస్తున్న వ్యక్తి రహస్యంగా ఎవరి కంట పడకుండా కూడా ఏదీ తినడు, ఏదీ తాగడు. దైవం చూస్తున్నాడనే ఈ భావం మనిషి ప్రతి ఆచరణలో ఉంటే

మనిషిలో సానుభూతి జనిస్తుంది.
ప్రేమ జనిస్తుంది.
సహనం అలవడుతుంది
ఆగ్రహంలో నిగ్రహం ఉంటుంది
ఆలోచనల్లో నిలకడ ఉంటుంది
ఇంకా–
లంచాలు ఉండవు
దౌర్జన్యాలు ఉండవు
హత్యలు ఉండవు
అన్యాయాలు ఉండవు
అరాచకాలు ఉండవు

నైతికంగా సద్వర్తనులైన సజ్జనుల సమాజం ఏర్పడుతుంది. ఇదేదో కాల్పనిక రూపకల్పన (Utopia) కాదు. కుందేటి కొమ్ము అంతకన్నా కాదు. 14 శతాబ్దుల క్రితం ఈ విశిష్ట నడవడి ఆధారంగా ఓ సత్సమాజ రూపకల్పన జరిగింది. ఆ సమాజంలో క్షణికావేశంలో కాలుజారిన వారు స్వయంగా రాజ్యాధిపతి దగ్గరకు వచ్చి తమను దండించి పాపప్రక్షాళనకు అవకాశం కల్పించమని నివేదించుకున్నారు. ఇలాంటి వ్యక్తులు ఎంత ఎక్కువగా ఉంటే సమాజం అంతే అందంగా, అంతే ఉత్తమంగా రూపొందుతుంది. అలాంటి సమాజ నిర్మాణ సాధనం ఉపవాసం.

ఉపవాసం ఉండి చెడు పనులను మానుకోని వ్యక్తి ఉపవాసాన్ని దైవం అతని ముఖాన విసిరి కొడతాడు.

రమజాన్ గురించి క్లుప్తంగా చెప్పాలంటే, ఇది మనిషి తన జీవితాన్ని సింహావలోకనం చేసుకునే సందర్భం. మనిషి ఆధ్యాత్మిక ప్రగతికి మహత్తర అవకాశం. సృష్టికర్తతో సంబంధాన్ని పటిష్టం చేసుకునే సాధనం. ఉపవాసం అంటే కేవలం తిండి తిప్పలు మానుకోవడం కాదు. సానుభూతిని పెంచుకోవడం. ప్రేమను పంచుకోవడం. ఆలోచనలను శుద్ధి చేసుకోవడం, ఆచరణలను సంస్కరించుకోవడం. దయ కరుణలను ప్రోత్సహించడం, తన సంపదను పరులతో పంచుకోవడం, పరుల బాధలను తాను కూడా పంచుకోవడం, మంచిని పెంచడం, చెడును తుంచడం.

ఇలాంటి సమాజం ఎలాంటి సమాజంగా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి.

అక్కడ మనిషి ప్రతి రోజు నిద్రపోయే ముందు ఆ రోజు –

ఎంత సంపాదించానన్నది ఆలోచించడు... ఎన్ని మంచి పనులు చేశానన్నది ఆలోచిస్తాడు.

ఎన్ని ఆస్తులు కూడబెట్టాడన్నది ఆలోచించడు .. ఎంతమందికి సహాయం చేశానన్నది ఆలోచిస్తాడు

ఎంత ఎంజాయ్ చేశానన్నది ఆలోచించడు ... ఎంత దానం చేశానన్నది ఆలోచిస్తాడు.

అలాంటి సమాజం కోసం ప్రయత్నిద్దాం.




తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్)
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్-500 002 ఫోన్: 24564583

మీ సందేహాల నివృత్తికోసం ఈ రోజే మా కాల్ సెంటర్‌కు ఉచితంగా ఫోన్ చేయండి.
Islamic Information Center మా టోల్ ఫ్రీ నెంబర్: 1800 572 3000